
సభా వేదిక వద్ద కాంగ్రెస్ నాయకుల కటౌట్లు



## అనుమతి లేకున్నా..
# అడ్మిషన్లు..!



- అయోమయంలో డిప్లొమా విద్యార్థులు
- 26 కళాశాలల ఫలితాలకు బ్రేక్
- అధికారులపై తల్లిదండ్రుల ఆగ్రహం

బెంగళూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ కళాశాలల ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. ధనాపేక్షతో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి. అనుమతి లేకున్నా అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థుల భవితవ్యంతో ఆటుకుం టున్నాయి. విద్యాసంస్థలపై నిరంతరం పర్యవేక్షించాల్సిన అధికారులు నిద్రమత్తు వదలడం లేదు. విద్యాశాఖ అధికారులు ప్రాంతాలవారీగా విద్యాశాఖ అధికారులు సంస్థలు కొనసాగేందుకు ఉన్న అర్హతలను, సౌకర్యాలను పరిశీలిస్తుంటారు. పరీక్షలు, తదితర అంశాలు సంబంధిత ప్రాంతీయ అధికారులు పర్యవేక్షిస్తుంటారు. ఇంతటి నిఘా ఉన్నా రాష్ట్రవ్యాప్తంగా అనుమతులు లేకుండానే కొనసాగుతున్న విద్యాసంస్థలు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. గ్రామీణ, నగర ప్రాంతాల్లో ప్రీ నర్సరీలు, ప్రాథమిక పాఠశాలలు కొన్నేళ్లపాటు కొనసాగించి ఆ తర్వాత అనుమతులు తీసుకుంటామని విద్యార్థుల తల్లిదండ్రులను నమ్మిస్తుంటారు. అయితే ఉన్నత విద్యలో భాగమైన డిప్లొమా కళాశాలలు సైతం అనుమతులు లేకుండానే కొనసాగడంతో విద్యార్థుల భవిష్యత్తు అయోమయంగా మారింది. కళాశాల పాలకమండలిలో తప్పిదాలకు విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. వారు ఉన్నత విద్యకు వెళ్లే పరిణామానికి చెక్ పెట్టినట్లు అవుతోంది. రాష్ట్రంలో ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు సాంకేతిక విద్యాశాఖ అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా 26 పాలిటెక్నిక్ కళాశాలలు అనుమతులు లేకుండా కొనసాగుతున్నాయన్న విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో 350మంది విద్యార్థుల డిప్లొమా పరీక్షల ఫలితాలకు బ్రేక్ పడింది. మరో 78 మంది విద్యార్థులకు పరీక్షలకు అవకాశమే కల్పించలేదు. సాంకేతిక విద్యా విభాగం నిబంధనలు పాటించకపోవడమే సంబంధిత విద్యాసంస్థలు చేసిన తప్పిదంగా తెలుస్తోంది.

### హెచ్చరించినా పట్టించుకోలేదు..

రాష్ట్రంలో 102 ప్రభుత్వ, 44 ఎయిడెడ్, 192 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 26 కళాశాలలు పాలిటెక్నిక్ కోర్సులు కొనసాగించేందుకు అనుమతులు పొందలేదు. సాంకేతిక విద్యావిభాగం పలుమార్లు హెచ్చరించినా సంబంధిత సంస్థలు స్పందించలేదు. దీంతో విద్యార్థులు పరీక్షల్లో పాల్గొనకుండా టెక్నికల్ ఎడ్యుకేషన్ విభాగం కట్టడి చేసింది. అయితే విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ఉండాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల వినతిమేరకు 428 మంది విద్యార్థులపైకి 350మందికి ఇటీవల పరీక్షలకు అవకాశం కల్పించారు. అయితే సంబంధిత ప్రైవేట్ కళాశాలలు అనుమతులు పొందేవరకు ఫలితాలను ప్రకటించకుండా కట్టడి చేసింది. ఒకవేళ విద్యార్థులు ఫలితాలు ప్రకటించాలంటే అనుమతులు పొందలేకపోవడానికి తగిన కారణాలు వివరించాలి. జరిమానా చెల్లించాలనే నిబంధన ఉంది. భవిష్యత్తులో నిర్లక్ష్యం కొనసాగించమని ముందస్తుగా హామీపత్రాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఫలితాలు విడుదల చేస్తామని టెక్నికల్ ఎడ్యుకేషన్ విభాగం సూచించింది.

### యథేచ్ఛగా అనుమతులు

డిప్లొమా కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశం పొందిన తర్వాత సాంకేతిక విద్యావిభాగం అనుమతులు ఇస్తుంది. కళాశాల ఇన్‌టేక్, ప్రవేశం పొందిన విద్యార్థుల సంఖ్యను పరిశీలించిన తర్వాతనే అనుమతులిస్తారు. అయితే కొన్ని కళాశాలల్లో విద్యార్థులను చేర్చుకునే ఆత్రుతలో చివరిరోజున ఇన్‌టేక్‌ను పట్టించుకోకుండానే అడ్మిషన్లు చేస్తున్నారు. అదే అనుమతులు దక్కకపోవడానికి కారణమవుతోంది. కొన్ని ప్రైవేట్ డిప్లొమా కళాశాలలు నేరుగా తరగతులు కొనసాగించారు. పొరుగు రాష్ట్రాలు లేదా విద్యార్థులనుంచి ఫీజులు వసూలు చేసి అడ్మిషన్లు చేస్తారు. సదరు విద్యార్థులు తరగతులకు హాజరు కాకున్నా పరీక్షలకు అవకాశం కల్పిస్తారు. అంతిమంగా పరీక్షలు రాసే వెసలుబాటు ఇస్తుండడంతో ఇటువంటి సంస్థల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. అందుకు పలు కారణాలు ఉన్నాయి. విద్యార్థులు మరో చోట కోర్సులు చేయడం, వ్యాపారం, ఉద్యోగం వంటి వ్యవహారాలలో కొనసాగుతూ డిప్లొమా చేసేవారు ఉన్నారు. కొన్ని కళాశాలలను ఎంపిక చేసుకుంటున్నట్లు సాంకేతిక విద్యాశాఖ అనుమానం వ్యక్తం చేస్తోంది.

### విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలిగించం

కళాశాలలు చేసిన తప్పిదాలకు విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలిగించాలనే ఆలోచన లేదని టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ హెచ్ ప్రసన్న అన్నారు. కళాశాలలు కొనసాగించే వారు ముందస్తుగా అన్నింటినీ పరిశీలించుకోవాల్సి ఉంటుందన్నారు. అనుమతులు తీసుకోకపోవడానికి గల కారణాలను వివరిస్తూనే జరిమానా చెల్లించి భవిష్యత్తులో పునరావృతం కాకుండా హామీ ఇస్తే ఫలితాలు ప్రకటించేందుకు అభ్యంతరం లేదన్నారు.

## జాతిపితకు
# వందనం..!

- గాంధీజీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి వందేళ్లు
- శతాబ్ది సంబరాలకు అంతా సిద్ధం
- కుందానగరికి కాంగ్రెస్ నాయకులు
- అగ్రనేతల మకాం ఇక్కడే..
- హాజరు కానున్న ఖర్గే, రాహుల్
- ఖరారు కాని సోనియా పర్యటన



బెంగళూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి వందేళ్లు పూర్తి అయిన సందర్భంగా కుందానగరి బెళగావిలో కాంగ్రెస్ శతాబ్ది సంబరాలు ఆడంబరంగా నిర్వహిస్తున్నారు. సంబరాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నాలుగురోజులుగా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, రణదీప్‌సింగ్ సుర్జేవాలా, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అక్కడే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. గురువారం నుంచి రెండు రోజులపాటు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. బుధవారం సాయంత్రానికి సీఎం సిద్దరామయ్య బెళగావికి చేరుకుని ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. కాగా మంత్రులు హెచ్‌కే పాటిల్, లక్ష్మీ హెబ్బాళ్కర్, జమీర్ అహ్మద్‌తోపాటు పలువురు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పార్టీ సీనియర్ నేతలు వీరప్పమొయిలీ, బీఎల్ శంకర్ తదితరులు బెళగావికి చేరుకున్నారు.

### కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు..

1924 డిసెంబరు 27న మహాత్మాగాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సభ బెళగావిలో జరిగింది. వందేళ్లు పూర్తైన సందర్భంగా వీర సౌధలో ప్రత్యేకంగా సిద్ధం చేసిన గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. 1924 నాటి సభకు సంబంధించిన ఆధారాలతో సిద్ధం చేసిన ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తారు. అప్పటి ఫొటోల ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నారు. వందేళ్ళకిందట బాపూజీ కాంగ్రెస్ అధ్యక్షుడు కాగా ప్రస్తుతం రాష్ట్రానికి చెందిన మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. అప్పట్లో గాంధీజీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జవహర్‌లాల్ నెహ్రూతో పాటు కర్ణాటకకు చెందిన గంగాధర దేశ్‌పాండే ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. నాటి స్మృతులను స్మరించుకోవడంతోపాటు ఇదే వేదిక నుంచి అప్పట్లో స్వాతంత్ర్య పోరాటం కోసం గాంధీజీ పలు సత్యాగ్రహాలకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశంలో కాంగ్రెస్ బలోపేతానికి చేపట్టదలిచిన కార్యాచరణకు దిశా నిర్దేశం వేదికనుంచి చేయాలని భావిస్తున్నారు.

### నేటి కార్యక్రమాలు

గురువారం ఉదయం 10 గంటలకు సీఎం సిద్దరామయ్య టిలకవాడి వీర సౌధలోని గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ఫొటో ప్రదర్శనను ప్రారంభిస్తారు. 10.45 గంటలకు ఖాదీ మేళాను ప్రారంభిస్తారు. 11.15 గంటలకు గంగాధర దేశ్‌పాండే స్మారకాన్ని, ఆయన ఛాయాచిత్ర ప్రదర్శనకు శ్రీకారం చుడతారు. మధ్యాహ్నం 1 గంటకు ఏఐసీసీ నాయకులతో కలసి మధ్యాహ్న భోజనం ఉంటుంది. మధ్యాహ్నం 3 గంటలకు టిలకవాడి వీరసౌధలో కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం జరగనుంది. సాయంత్రం 7 గంటలకు బెళగావి క్లబ్‌లో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విందు ఇవ్వనున్నారు.

### రేపు గాంధీజీ విగ్రహావిష్కరణ

27న శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సువర్ణసౌధలో గాంధీ విగ్రహాన్ని మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ ఆవిష్కరిస్తారు. అనంతరం జరిగే సభకు ముఖ్యమంత్రి అధ్యక్షత వహిస్తారు. స్పీకర్ యూటీ ఖాదర్, సభాపతి బసవరాజ హొరట్టిల ఆధ్వర్యంలో కార్యక్రమం జరగనుంది. మధ్యాహ్నం 12 గంటలకు ముఖ్యమంత్రి అతిథులకు విందు ఇవ్వనున్నారు. ఒంటి గంటకు బహిరంగసభ ఏర్పాటు చేస్తారు. ఈ సభకు 'జైబాపు, జై భీమ్, జై రాజ్యాంగం' పేరు పెట్టారు. బెళగావిలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ఎస్కాం ద్వారా విద్యుద్దీపాలంకరణ చేశారు. ఏడాది పొడవునా రాష్ట్రవ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలను గాంధీ భారత్ కార్యక్రమం పేరిట నిర్వహించదలిచారు. పాఠశాలలు, కళాశాల్లో చర్చాగోష్ఠులు, గాంధీజీ సిద్ధాంతాలు, ఆచార వ్యవహారాలపై చర్చలు, వ్యాసరచన పోటీలు వంటివి జరపనున్నారు. గాంధీ విగ్రహావిష్కరణకు రాష్ట్రానికి చెందిన ఎంపీలందరినీ ఆహ్వానించారు. కాంగ్రెస్ సభకు కేవలం పార్టీ ముఖ్యనేతలు, వివిధ రాష్ట్రాల ప్రముఖులు మాత్రమే పాల్గొంటారు.

### ఖరారు కాని సోనియా పర్యటన

కాంగ్రెస్ సభకు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీల పర్యటన ఖరారైంది. అయితే ముందుగా ప్రచారం చేసినట్లుగా సోనియాగాంధీ, ప్రియాంకగాంధీల పర్యటన ఇంకా ఖరారు కాలేదు. వాస్తవానికి నెలరోజుల ముందే ఈ కార్యక్రమానికి అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాను ఆహ్వానించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీఎం డీకే శివకుమార్



ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు, ప్రసంగిస్తున్న ఫాదర్

7

## రాష్ట్రమంతటా క్రిస్మస్ సంబరాలు


ఎమ్మెల్యే తలపై బద్దలవుతున్న కోడిగుడ్లు

## ఎమ్మెల్యే మునిరత్నపై కోడిగుడ్లతో దాడి


- ముగ్గురి అరెస్టు
- హత్యకు కుట్ర: ఎమ్మెల్యే
- రోడ్డుపై బైఠాయించి నిరసన

7

## ఘనంగా వాజ్‌పేయి జయంతి

- మాజీ ప్రధానికి బీజేపీ నేతల నివాళి
- అటల్ పురస్కారాల ప్రదానం -7లో..


వాజ్‌పేయికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1627.82 | 1,589.44 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 429 | 0 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 7,432 | 858 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 86.10 | 10.57 |

ఎనిమిది నెలల్లో 23మంది

# బాలింతల మృతి

● ప్రభుత్వానికి కలెక్టర్ నివేదిక

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరుస బాలింతల మృతి రాష్ట్ర స్థాయిలో చర్చనీయాంశమైంది. ఈ ఘటనను రాష్ట్ర ప్రభుత్వ తీవ్రంగా పరిగణించి నివేదిక అందజేయాలని జిల్లాధికారికి సూచించింది. ఈ నేపథ్యంలో బళ్లారి జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా జిల్లా పరిధిలోని బిమ్స్, జిల్లా ఆసుపత్రులతో పాటు తాలూకా స్థాయి ఆసుపత్రుల్లో జరిగిన బాలింతల మృతిపై నివేదికను ప్రభుత్వానికి పంపారు. జిల్లాలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 23మంది బాలింతలు మృతి చెందినట్లు నివేదికలో పేర్కొన్నారు. నగరంలోని జిల్లా ఆసుపత్రితో పాటు బిమ్స్, తాలూకా పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మృతుల వివరాలు నివేదికలో పేర్కొన్నారు. ప్రసవ సమయంలో బాలింతలు అపోష్టికత, అనీమియా, ఇతరత్ర వ్యాధులతో బాధపడుతున్నట్లు తెలిపారు. సిజేరియన్ చేయించుకున్న బాలింతలే ఎక్కువగా మృతి చెందినట్లు నివిదికలో పేర్కొన్నారు. బాలింతల మృతులను అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు, ఈ విషయంపై జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు, ఇతర వైద్య నిపుణులతో చర్చలు జరిపి భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు కృషి చేయనున్నట్లు జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా నివేదికలో పేర్కొన్నారు.



జిల్లా అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా

## రీనాకు ఎస్కేయూ డాక్టరేట్

బళ్లారి సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బళ్లారిలోని విజయనగరం శ్రీకృష్ణదేవ రాయ యూనివర్సిటీ నిర్వహణశాస్త్ర విభాగం నుంచి ఆర్. రీనా డాక్టరేట్ పట్టా పొందారు. బళ్లారి నగరానికి చెందిన రీనా విశ్వవిద్యాలయం వ్యవహార అధ్యయన విభాగం ఆచార్యుడు దినేశ్ మార్గదర్శకంలో డాక్టరేట్ పూర్తి చేశారు. బళ్లారి రాయచూరు, విజయనగర జిల్లాల్లో మహిళా వైద్యుల యోగ క్షేమాలు, విధుల నిర్వహణలో సమస్యలపై పరిశోధన చేసి నివేదిక సమర్పించారు. దీన్నిపరిశీలించిన ఆచార్యులు, సిండికేట్ సభ్యులు రీనాకు డాక్టరేట్ అందజేస్తున్నట్లు ప్రకటించారు.



### భక్తిశ్రద్ధలతో ఖాదర్ లింగ తాత ఉరుసు

కంప్లి, డిసెంబరు 25(ఆంధ్ర జ్యోతి) : నియోజకవర్గంలోని కురుగోడు, యల్లాపురం క్రాస్ వద్ద వెలసిన ఖాదర్ లింగ దర్గా వద్ద ఉరుసును బుధవారం ఘనంగా నిర్వహించారు. కర్ణాటక, ఆంధ్ర భక్తాదులు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇరు రాష్ట్రాలనుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు.





అలంకరణలో ఖాదర్ లింగ దర్గా

# హృదయాలను కదిలించిన 'చీకటి బతుకులు'

● రాఘవ కళామందిరంలో రైతు కష్టాలపై నాటకం ● సందేశంతో ఆకట్టుకున్న ప్రదర్శన

బళ్లారి సిటీ . డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాయ కష్టం చేస్తూజీవితాన్ని సాగించే రైతుల బతుకులు కష్టాల సుడిగుండంలో చిక్కుకుని తనవు చాలిస్తున్నాయి. ప్రకృతి కూడా వారికి శాపంగా మారి అన్నదాత బతుకులను చీకటిమయం చేస్తున్నాయి. రైతుల కష్టాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించిన 'చీకటి బతుకులు' నాటిక ప్రేక్షకులను కట్టిపడేసింది. బుధవారం పట్టణంలోని రాఘవ కళామందిరంలో 'చీకటి బతుకులు' నాటకం ప్రదర్శించారు. ప్రేక్షకులకు కన్నీరు తెప్పించింది. సీ.భీమప్పశెట్టి జయంతి సందర్భంగా రాఘవ మెమోరియల్ అసోసియేషన్ సహకారంతో విశ్రాంత తెలుగుప్రిన్సిపాల్ జీఆర్. వెంకటేశులు దర్శకత్వంలో ప్రదర్శించారు. నాటిక ప్రారంభం మందు రాఘవకళామందిరం గౌరవ అధ్యక్షుడు కే.చన్నప్ప , అధ్యక్షుడు కోటేశ్వరావు, కళాకారులు జ్యోతిని వెలిగించి నాటికను ప్రారంభించారు. మొత్తం 11 మంది కళాకారులు కటుంబ పెద్దగా రామయ్య పాత్రలో జీఆర్.వెంకటేశులు, సాకమ్మపాత్రలో ఆదోని వీణా, వెంకటనారాయణ పాత్రలోరామచంద్ర, తులశమ్మ పాత్రలో దేవసేన, శివన్నపాత్రలో నాగభూషణ, జమిందార్ పాత్రలో శ్రీనివాసులు, తలారి పాత్రలో ఎం.రామాంజనేయులు నటించారు. రైతుల కష్టాలను నాటికలో చక్కగా వివరించారు. అప్పుల పాలైన రైతులకు ప్రభుత్వం, వడ్డీ వ్యాపారులు ఎలా సహకారం అందించారని సందేశాత్మకంగా వివరించారు. అనంతరం కళాకారులకు రాఘవ మెమోరియల్ అసోసియేషన్ బహుమతులు అందజేశారు. రాఘవ కళామందిర్ గౌరవ అధ్యక్షుడు చన్నప్ప మాట్లాడుతూ చీకటి బ్రతులకు నాటిక ఎంతాగానో ఆకట్టుకుందని చక్కటి సందేశాన్ని ఇచ్చిందని హర్షం వ్యక్తం చేశారు.



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

# ఘనంగా క్రిస్మస్ సంబరాలు



రాయచూరులో వేడుకల్లో చిన్నారులు

**బళ్లారి సిటీ/రూరల్/కంప్లి/రాయచూరు డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రవ్యాప్తంగా బుధవారం క్రైస్తవులు క్రిస్మస్ పండుగను వైభవంగా నిర్వహించుకున్నారు. చర్చిలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రార్థనలు ప్రారంభించారు. ఆరోగ్యమాత చర్చితో పాటు వివిధ చర్చిల్లో ఏసుప్రభు జన్మవృంతాంతం ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కోటప్రదేశంలోని తెలుగు సీఐ చర్చిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే చర్చిల్లో ప్రార్థనలు ప్రారంభించారు. తేరు వీదిలోని సీఎస్ఆర్ చర్చికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కోట ప్రాంతంలోని తెలుగు, ఇంగ్లీషు, తమిళ, కన్నడ చర్చిల్లో , విజయనగరం జిల్లా కేథలిక్ చర్చిల్లో విశేషంగా భక్తులు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

### క్రైస్తవులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

కంప్లి : క్రైస్తవ సమాజానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పేర్కొన్నారు. స్థానిక సోమప్ప దేవస్థానం వద్ద వుండే ఎల్ షెడాలయ్య చర్చిలో ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులంతా సమైక్యంగా ఉండి సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చాంద్ బాషా, షణ్ముఖప్ప, రైతు సమాజం పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్



బళ్లారిలో చర్చి వద్ద సందడి

# నిష్కళంక పాలకుడు వాజ్‌పేయి: ఎమ్మెల్యే



రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

రాయచూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): దేశ ప్రధానిగా అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన నిష్కళంక పాలకుడు అటల్ బిహారి వాజపేయి దక్షతగల పరిపాలకుడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ కీర్తించారు. వాజపేయి శత జయంతిని పురస్కరించుకుని నగర, మండల శాఖల ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ప్రత్యేక రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన సిటీ ఎమ్మెల్యే, వాజపేయి చూపిన మార్గం బీజేపీకి అనుసరణీయమన్నారు. పాలన పరంగా ఎలాంటి అవినీతికి అసమర్థతకు తావు లేకుండా సుస్థిర ప్రభుత్వాన్ని అందించిన ఘనత వాజపేయిదేనన్నారు. భారత దేశానికి పాకిస్తాన్ శత్రుదేశం అని భావించినప్పటికి స్నేహ పూర్వక వాతావరణం కొనసాగించే దిశగా ఆ దేశానికి బస్సు యాత్రను ప్రారంభించడం ద్వార కొత్త వరవడికి శ్రీకారం చుట్టారన్నారు. దేశాభివృద్ధిలో రోడ్లది ప్రధాన పాత్ర అని నమ్మిన వాజపేయి, దేశంలో జాతీయ రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. ఆయన వేసిన అభివృద్ధి బాటలు నేడు సత్ఫలితానిస్తున్నాయని ఆయన చూపిన మార్గం దేశ ప్రజలకు అనుసరణీయమన్నారు.

కంప్లి : భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకులు అటల్ బిహారీ వాజ్‌పేయిని ప్రతి ఒక్కరూ గుర్తుంచు కోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు హళ్లి వీరేష్ తెలిపారు. పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో వాజ్‌పేయి భావచిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీకి అటల్ చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకున్నారు. వారితో పాటు రామాంజిని, సుధాకర్, చెన్నప్ప, విరుపాక్షి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వాజ్‌పేయికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



భూమి పూజలో నారా కుటుంబ సభ్యులు

# ఐఎంఏ భవన నిర్మాణానికి భూమిపూజ

● మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణ రెడ్డి రూ.50 లక్షలు, నారా ప్రతాప్ రెడ్డి ఎకరా భూమి విరాళం

బళ్లారి,డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంగనకల్లు వద్ద ఉన్న ఎన్‌పీఆర్ ప్రకృతి లేఔట్ వద్ద ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) భవన నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త కురుగోడు మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణ రెడ్డి రూ. 50లక్షలు విరాళం ఇవ్వగా, ఆయన సోదరుడు బుడా మాజీ అధ్యక్షుడు పారిశ్రామికవేత్త నారా ప్రతాప్ రెడ్డి ఎకర భూమిని విరాళంగా ఇచ్చారు. ఈసందర్భంగా ఐఎంఏ అధికారులకు వీరు లిఖిత పూర్వకంగా విరాళం ఇస్తూ చెక్కును పంపిణీ చేశారు. బుధవారం పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నారాసూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఐఎంఏ నిర్మాణంతో వైద్య రంగానికి పెద్దపీట వేయడంతో పాటు ఎంతో మంది ప్రజలకు వైద్యసేవలు అందుతాయని భావించి విరాళం ఇచ్చినట్లు తెలిపారు. నారాప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రజల శ్రేయస్సుకే భూమిని అందజేశామన్నారు. దాతలిద్దరినీ ఐఎంఏ అధికారుల ఘనంగా సత్కరించారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, విమ్స్ డైరెక్టర్ గంగాధరగౌడ్, డా.బసారెడ్డి, అశ్విని కుమార్, రమేశ్ పాల్గొన్నారు. సోమనాథ్, మాణిక్‌రావు, తిలకరాణి,రాఘవేంద్రతోపాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

# పెంటావాలెంట్ టీకాతో 12 వ్యాధులకు చెక్

● తల్లిదండ్రులు సహకరించాలి : డీహెచ్‌ఓ రమేశ్‌బాబు



చిన్నారులకు టీకా వేస్తున్న ఆరోగ్య సిబ్బంది, పరిశీలిస్తున్న డీహెచ్‌ఓ

బళ్లారి సిటీ,డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పుట్టిన 45రోజులలోపు శిశువుకు పెంటావాలెంట్ వ్యాక్సిన్ వేయించి ప్రాణాంతక వ్యాధులను అరికట్టేందుకు తల్లిదండ్రులు సహకరించాలని జిల్లా ఆరోగ్యశాఖ కుటుంబ సంక్షేమ శాఖఅధికారి రమేశ్‌బాబు అన్నారు. జిల్లాపాలన యంత్రాంగం, జిల్లాపంచాయతీ,జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, స్త్రీశిశు అభివృద్ధి శాఖ పట్టణప్రాథమిక ఆరోగ్య శాఖసంయుక్త ఆధ్వర్యంలో డిసెంబరు 31వరకు నిర్వహించనున్న పెంటవాలే ఎట్ వ్యాక్సిన్ ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాల్యంలో కనిపించే ప్రాణాంతక వ్యాధుల నుంచే కాక పిల్లల సాధారణ వ్యాధులైన జలుబు, దగ్గు, తేలికపాటి జ్వరం వచ్చినా రోగనిరోధక శక్తితో నివారణ సాధ్యమన్నారు. 12ప్రాణాంతక వ్యాదులకు టీకాతో చెక్ పెట్టవచ్చన్నారు. ఒకటిన్నర నెలలు, రెండన్నరనెలలు, మూడున్నర నెలల వయస్సులో టీకా వేయించాలన్నారు. ఈసందర్భంగా పరిపాలన వైద్యాధికారిణి డాక్టర్. సురేఖ, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, డీఎస్ఓ గిరీశ్, కావ్య, రామకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్త మరియమ్మ, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# 31 నుంచి రవాణా ఉద్యోగుల నిరవధిక సమ్మె

● కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ ప్రకటన




మాట్లాడుతున్న రవాణా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆదిమూర్తి

బళ్లారి సిటీ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): బకాయిల చెల్లింపు,జీతాల సవరణ, రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిల విడుదల వంటి పలు డిమాండ్‌ల సాధన కోసం రాష్ట్రంలోని రవాణా సంస్థ ఉద్యోగులు బంద్‌కు పిలుపునివ్వనున్నట్లు సంఘం నాయకులు ఆదిమూర్తి తెలిపారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు, కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ నాయకులు బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హామీ పథకాల ద్వారా రవాణా సంస్థకు 25శాతం ఆదాయం పెరిగిందని, అయినా ప్రాజెక్టుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు కేటాయించలేదన్నారు. నిధుల విడుదల చేస్తే కొత్త బస్సులు కొనుగోలు చేయవచ్చన్నారు. జాయింట్ యాక్షన్ కమిటీ ముందుగా నిర్ణయించిన ప్రకారం, బెళగావి శాసనసభ శీతాకాలం సమావేశాల మొదటి రోజు చలో నిర్వహించి సమ్మె గురించి ముఖ్యమంత్రికి సమస్యలు తెలియజేశామని, మంత్రి దినేష్ గుండురావు, సంతోష్ లాడ్ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో 31 నుంచి బంద్‌కు పిలుపునిచ్చా మన్నారు. సంఘం నాయకులు హనుమంతప్ప, గడలింగప్ప, శివకుమార్, చెన్నప్ప, బసవరాజ్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పాతిక లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు బుధవారం భూమిపూజ చేశారు. సిరుగుప్ప తాలుకాలోని పగ్గూరు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులతో పాటు వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేపడ్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఉలిగయ్య, నగర సభ అధ్యక్షురాలు రేణుకమ్మ, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, గణేష్ పాల్గొన్నారు.

# కన్నడ సంఘాల సంబరాలు

బళ్లారి సిటీ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది అఖిల భారత కన్నడ సాహిత్య మహాసభలు బళ్లారిలో నిర్వహి ంచనున్నట్లు ప్రకటించడంతో నగరంలోని కన్నడ సంఘాలు రాయల్ సర్కిల్ వద్ద బుధవారం సంబరాలు జరుపుకున్నాయి. ఈసందర్భంగా కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు నిష్టి రుద్రప్ప మాట్లాడుతూ.. 66ఏళ్ల తర్వాత మళ్ళీ బళ్లారికి సదస్సు రావడం హర్షణీయమన్నారు. ఈసందర్భంగా కర్ణాటక ఏకీకరణ డిఫెన్స్ ఆర్మీకమిటీ శేఖర్, కార్పోరేషన్ సభ్యుడు పి.గాదెప్ప, ఉప్పర సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్దేశ్ ఊలూరు, పలువురు సంస్థ నాయకులు పాల్గొన్నారు.




రాయల్ సర్కిల్లో సంబరాలు జరుపుకుంటున్న నాయకులు

# హోసూరు జోన్

## కోలాటంలో చిన్నారుల ప్రతిభ



విద్యార్థులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హోసూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మారెమ్మ ఆలయంలో జరిగిన కోలాట పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. బుక్కసాగరంలోని మారియమ్మ దేవాలయంలో కోలాటబృందం ఆధ్వర్యంలో గజ్జెల పూజ వైభవంగా జరిగింది. సంప్రదాయాలను కొనసాగించేలాంటి కార్యక్రమాలు కొనసాగించేలా కార్యక్రమాలు జరిగాయి. కోలాటం నేర్పించిన గురువులు రత్నమ్మ మాట్లాడుతూ బృందంలో 32మంది మహిళలు పాల్గొన్నారన్నారు. కోలాటం ఆడడం వల్ల మహిళలకు ఆరోగ్యం సాధ్యమని అభిప్రాయపడ్డారు. దేవాలయాలలో కార్యక్రమాలు నిర్వహిస్తే తమ జట్టు కోలాటం ఆడుతుందన్నారు.

### అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

నగరంలో టీవీఎస్ నగర్ కాలనీ సమీపాన కొత్తూరు ఆంజనేయ స్వామి ఆలయంలో అయ్యప్పకు విశేషపూజలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. బుధవారం వేకువజామున గణపతి పూజ, హోమం ప్రారంభించారు. ఆలయాన్ని పూలతో అలంకరించారు. అయ్యప్ప స్వామివారికి 18మెట్లు అందంగా తీర్చిదిద్దారు. భక్తాదులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసిన అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

### అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలి : ఏఐడీఎస్ఓ

బళ్లారి సిటీ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని బస్తీ జిల్లాలో 10వ తరగతి చదువుతున్న బాలుడిని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐడీఎస్ఓ జిల్లా కార్యదర్శి కంబలి మంజునాథ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కులం పేరుతో దూషించడంతోనే బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఈఘటనను ఏఐడీఎస్ఓ బళ్లారి జిల్లా కమిటీ అత్యంత తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తక్షణమే దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.



ఏఐడీఎస్ఓ కార్యదర్శి కంబలి మంజునాథ్



చెరకు గడలతో రైతుల నిరసన

## ప్రభుత్వమే చెరకు కొనుగోలు చేయాలి

హోసూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా రైతులను ఆదుకునేందుకు చెరుకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతుసంఘాలు డిమాండ్ చేశాయి. జత చెరుకు గడలకు కనీసధర రూ.50గా ప్రకటించాలని, ఈ సంవత్సరం ఏనుగుల, పందుల దాడులతో పంటలు నష్టపోయామన్నారు. రైతుల సంక్షేమాన్ని పరిగణించి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డెంకణీకోట, తళి ప్రాంతాలలో ఎక్కువగా చెరుకు సాగు చేశారు. ప్రతి ఏటా ప్రభుత్వం రేషన్ దుకాణాలలో సంక్రాంతి పండగకు చెరుకులతోపాటు బెల్లం, బియ్యం, చక్కెర, ద్రాక్ష వంటివి ఉచితంగా ఇస్తున్నారు. ఇతర ప్రాంతాలలో కొనుగోలు చేయడానికి బదులు హోసూరు, డెంకణీకోట ప్రాంతాలనుంచి చెరుకును కొనుగోలు చేయాలని రైతుసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

## ఘనంగా వాజ్‌పేయి జయంతి

హోసూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానీ అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకుని బీజేపీ హోసూరు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. దేశానికి ఆయన అందించిన సేవలను వక్తలు ప్రస్తావించారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, తూర్పు మున్సిపల్ కౌన్సిల్ మణికంఠన్ అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు మురుగన్, శ్రీనివాసులు, రాజశేఖర్, పశ్చిమ అధ్యక్షుడు రమేశ్, తూర్పు మున్సిపాలిటీ నిర్వాహకులు వెంకటేశులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

### మావో జెడాంగ్ (జయంతి)



చైనా కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం కొనసాగిన మావో జెడాంగ్ 1893 డిసెంబరు 26న చైనా దేశం హూనన్ ప్రాంతం షావోషాన్ గ్రామంలో జన్మించారు. 'మావో సే టుంగ్' అని కూడా పిలుస్తారు. 'పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా' స్థాపనకు మూలమైన సుదీర్ఘ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారు. 1949లో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పాటైంది. మార్క్సిస్ట్-లెనిన్ సిద్ధాంతాలు, మిలిటరీ పద్ధతులు, సరికొత్త రాజకీయ విధానాలతో మావోయిజమ్‌గా పేరొందాయి. ఆధునిక ప్రపంచ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులలో మావో ఒకరు. 1976 సెప్టెంబరు 9న కన్నుమూశారు.

### బాబా ఆమ్టే (జయంతి)




బాబా ఆమ్టేగా చిరపరిచితులైన 'పద్మ విభూషణ్' గ్రహీత మురళీధర్ దేవీదాస్ ఆమ్టే 1914 డిసెంబరు 26న మహారాష్ట్రలోని హింఘన్‌ఘాట్‌లో జన్మించారు. సంఘ సేవకుడిగా, ప్రధానంగా కుష్టు రోగుల పాలిట దేవుడిగా మారారు. గాంధీజీ సిద్ధాంతాలను పాటించి నర్మదా బచావో తదితర ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్నారు. ఉన్నత కుటుంబంలో జన్మించినా భోగ భాగ్యాలను వీడి అణగారిన వర్గాలకోసం జీవితాంతం కృషి చేశారు. జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు దక్కాయి. ఆనంద్‌వన్ ఆశ్రమాన్ని స్థాపించి అక్కడే జీవితాన్ని గడిపి 2008 ఫిబ్రవరి 9న ఆశ్రమంలోనే కన్నుమూశారు.

### మాలతీ చందూర్ (జయంతి)



తెలుగులో ప్రముఖ రచయిత్రులలో ఒకరైన మాలతీ చందూర్ 1928 డిసెంబరు 26న కృష్ణాజిల్లా నూజివీడులో జన్మించారు. తెలుగులో 26 నవలలు, 300కుపైగా ఆంగ్ల రచనలకు అనువాదం చేశారు. ఆంధ్రప్రభ వారపత్రికలో 'ప్రమదావనం' శీర్షిక 47ఏళ్లపాటు నిరంతరంగా కొనసాగి 'గిన్నిస్ రికార్డు'లో నమోదైంది. ఆమె రాసిన 'ఆంగ్ల తెలుగు భాషా వంటల పుస్తకం' నేటికీ రికార్డుస్థాయిలో అమ్ముడవుతోంది. 11ఏళ్లపాటు కేంద్రసెన్సార్ బోర్డు సభ్యురాలిగా పనిచేశారు. చెన్నైలోని పొట్టి శ్రీరాములు స్మారక సొసైటీ చైర్‌పర్సన్‌గా పలు సాహితీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకా డమీ పురస్కారం, ఇతర గౌరవాలు అందుకున్నారు. ప్రము ఖ తమిళ రచయితల రచనలను సైతం ఆమె తెలుగులో అనువాదం చేశారు. 2013 ఆగస్టు 1న కన్నుమూశారు.

### త్రైలింగస్వామి (వర్ధంతి)



త్రైలింగస్వామి 1607 నవంబరు 27న విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామంలో జన్మించారు. అసలు పేరు శివరాముడు. దశనామీ సంప్రదాయానికి చెందిన ఆయన తైలంగ, తైలంగ్‌స్వామిగా పేరొందారు. 'వారణాసిలో నడిచే శివుడని' రామకృష్ణ పరమహంస ప్రస్తుతించారు. సుదీర్ఘకాలం జీవించిన హిందూ యోగి, మార్మిక ఆధ్యాత్మిక శక్తులకు సుప్రసిద్ధి పొందారు. దేశంలో ప్రత్యేకించి బెంగాల్‌లో చిరస్మరణీయుడిగా నిలిచారు. కొన్ని ఆధారాల ప్రకారం ఆయన 280 సంవత్సరాల సుదీర్ఘకాలం జీవించారు. 1887 డిసెంబరు 26న కన్నుమూశారు.

### సావిత్రి (వర్ధంతి)




తెలుగు సినీ చరిత్రలో 'మహానటి'గా పేరొందిన నిశ్శంకర సావిత్రి 1936 డిసెంబరు 6న గుంటూరు జిల్లా చిర్రావూరులో జన్మించారు. తెలుగు, తమిళ సినీరంగాలలో నటి, దర్శకురాలు. దానధర్మాల విషయంలో ఆమెది ఎముకలేని చేయి. 'మాయాబజార్' సినిమాలోని ఆమె నటనా వైదుష్యం మణిమకుటంలా నిలిచింది. తమిళంలోనూ తనదైన ముద్ర వేసి 'నడిగర్ తిలగం' బిరుదు పొందారు. 1981 డిసెంబరు 26న కన్నుమూశారు.

# రాష్ట్రమంతటా క్రిస్మస్ సంబరాలు

బెంగళూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవులు క్రిస్మస్ సంబరాలు సంతోషంగా జరుపుకొన్నారు. ఉదయం 8 గంటలకే చర్చ్‌లకు భక్తుల రాక మొదలైంది. చర్చ్‌లో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేసుకున్నారు. 10 గంటలకు చర్చ్‌ఫాదర్‌లు క్రిస్మస్ ప్రాధాన్యతను బైబిల్‌లోని వ్యాక్యాల ద్వారా వివరించారు. ఏసుక్రీస్తు సమాజంలో శాంతిని ఆకాంక్షించారని తెలిపారు. ఆ తర్వాత ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. బెంగళూరులో ప్రసిద్ధి చెందిన శివాజినగర్‌లోని సెయింట్ బసిలికా చర్చ్‌తోపాటు చర్చ్‌స్ట్రీట్‌లోని ప్రార్థనామందిరం, కోరమంగల, ఇందిరానగర్, హడ్సన్ సర్కిల్, మైసూరు రోడ్డు, కేజీ రోడ్డు, యలహంకతోపాటు నగరంలోని వందలాది చర్చ్‌లలో ప్రత్యేక కార్యక్రమాలు సాగాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉడుపి, దక్షిణకన్నడ, మంగళూరు, ఉత్తరకన్నడ, బెళగావి, మైసూరు, మండ్య, బాగల్కోటె, హుబ్బళ్ళి, ధారవాడతోపాటు కోలారు, చిక్కబళ్ళాపుర, తుమకూరు, రామనగర జిల్లాల పరిధిలో ప్రత్యేకంగా వేడుకలు జరిగాయి.

### బంగారపేట తాలూకాలో..

బంగారపేట:: ఏడాది చివరన వచ్చే క్రిస్మస్ పండుగ నేపథ్యంలో పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా సందడి నెలకొంది. క్రైస్తవుల ఇంటి ముంగిట క్రిస్మస్ ట్రీ, స్టార్‌లు వెలిశాయి. చర్చ్‌లో ఉదయం 10 గంటలకు సామూహిక ప్రార్థనలు, ఏసుక్రీస్తు ఆరాధన, ధర్మగురువుల సందేశాలు వినిపించారు. ఏసుక్రీస్తు జన్మదినంగా క్రిస్మస్‌ను ఆచరిస్తారు. ఒకప్పుడు పాశ్చాత్యదేశాలకే పరిమితమైన క్రిస్మస్ క్రమేపీ అన్ని ప్రాంతాలకు విస్తరించింది.



బంగారపేట ప్రభుత్వ ఆసుపత్రి సమీపాన చర్చ్‌లో క్రిస్మస్ అలంకరణ

### బాగేపల్లి తాలూకాలో..

బాగేపల్లి: తాలూకా వ్యాప్తంగా శాంతిదూత ఏసుక్రీస్తు పుట్టినరోజును క్రిస్మస్‌గా ఆచరించారు. పట్టణంతోపాటు తాలూకాలోని అన్ని చర్చ్‌లను విద్యుద్దీపాలతో అలంకరించారు. క్రైస్తవుల ఇళ్ల ముంగిట క్రిస్మస్ ట్రీ, స్టార్‌లు ఏర్పాటు చేశారు. చర్చ్‌లలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించారు. శాంతాక్లాజ్ వేషధారణలు అలరించాయి. పట్టణంలోని హొసజీవన నిలయ ఫాదర్ హెచ్‌ఎస్ ప్రకాశ్ నేతృత్వంలో కార్యక్రమాలు సాగాయి. ఆడంబరం కంటే ప్రధానంగా ప్రేమ, దయ, కరుణ, క్షమ, సేవ వంటి మానవతా విలువలను అలవరచుకోవాలని ఆయన సూచించారు.

## ప్రతిభా పరీక్షలతో జ్ఞానవృద్ధి

బాగేపల్లి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో దాగియున్న ప్రతిభను వెలికితీసేలా నిర్వహించే ప్రతిభా పరీక్షల ద్వారా జ్ఞానవృద్ధి సాధ్యమని పట్టణంలోని బ్లూమ్స్ అకాడమీ పీయూ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ గోవిందరాజు అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కసబా హోబళి ఘంటంవారిపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాటైన ప్రతిభా పరీక్షల్లో అత్యున్నత మార్కులు పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఎల్‌సీ ప్రతి విద్యార్థికి ఎంతో కీలకమని, కావున శ్రద్ధగా చదవాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు రామసుబ్బమ్మ మాట్లాడుతూ ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులకు టాలెంట్ ఎగ్జామ్ నిర్వహించి ప్రోత్సహించడం సంతోషంగా ఉందన్నారు. సమయాన్ని వృథా చేయకుండా పోటీ పరీక్షల్లో సత్తా చాటాలన్నారు. లక్ష్యంతో చదివితే ఉన్నత హోదాలు అందుకోవచ్చునని విద్యార్థులకు హితవు పలికారు. బ్లూమ్స్ అకాడమీ కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

## స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించండి



కార్యకర్తలను సత్కరిస్తున్న కేంద్రమంత్రి శోభాకరంద్లాజె

మహదేవపుర, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): బీబీఎంపీ, జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధైర్యం చూపాలని కేంద్రమంత్రి శోభాకరంద్లాజె సవాల్ విసిరారు. నియోజకవర్గంలో సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొన్న కార్యకర్తలు, ప్రముఖులను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. కాగా ఈసారి 12కోట్లకుపైగా సభ్యత్వ నమోదు సాధ్యమైందన్నారు. ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. ఇందుకు కారణమైన కార్యకర్తలను నేరుగా సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బైరతి బసవరాజ్, మాజీ కార్పొరేటర్ సిద్ధలింగయ్య, వార్డు అధ్యక్షుడు శమంత్, మార్కెట్ రమేశ్, శాంతా కృష్ణమూర్తి, కల్కెరె కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాజ్‌పేయి జయంతి

బెంగళూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని సుపరిపాలనా దినోత్సవంలో భాగంగా నగరంలో బుధవారం జ్ఞానజ్యోతి ఆడిటోరియంలో ప్రముఖులకు అటల్ పురస్కా రాలు ప్రదానం చేశారు. మాజీ ప్రధాని దేవేగౌడ, మాజీ సీఎం యడియూరప్ప, రిటైర్డు ఐఏఎస్ అధికారి మదన్‌గోపాల్, రిటైర్డు వీసీ తిమ్మేగౌడలకు పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమాన్ని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్ ప్రారంభించగా నాడప్రభు కెంపేగౌడ జనపర వేదిక గౌరవాధ్యక్షుడు, సాహితీవేత్త ప్రొఫెసర్ కృష్ణేగౌడ అధ్యక్షత వహించారు.

### అటల్ అవార్డుల ప్రదానం

మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతిని నగరవ్యాప్తంగా పలుచోట్ల నిర్వహించారు. బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిం చారు. కేంద్రమంత్రులు ప్రహ్లాద్‌జోషి, శోభాకరంద్లాజె, మాజీ సీఎం యడియూరప్ప, పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా మల్లేశ్వరంలో ఎమ్మెల్యే అశ్వత్థనారాయణ నేతృత్వంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అజాతశత్రువుగా ఆయన సాధనలను వక్తలు వివరించారు.




పురస్కారాలతో మాజీ ప్రధాని దేవెగౌడ, యడియూరప్ప తదితరులు

## ఎమ్మెల్యే మునిరత్నపై గుడ్డుతో దాడి

▸▸ ముగ్గురి అరెస్టు - నన్ను హతమార్చేందుకు కుట్ర పన్నారు: ఎమ్మెల్యే

బెంగళూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రాజ రాజేశ్వరినగర్ బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నపై కోడిగుడ్లతో దాడి చేశారు. బుధవారం ఆర్ఆర్ నగర పరిధిలోని లక్ష్మీదేవి నగర్ వార్డు బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి జయంతిలో పాల్గొనేందుకు వెళ్తున్న ఎమ్మెల్యేపై గుడ్లతో దాడి చేశారు. నందిని పోలీస్‌స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకారులు ముగ్గురిని అరెస్టు చేశారు. ఇదే సందర్భంగా ఎమ్మెల్యే మునిరత్న రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. స్థానిక కాంగ్రెస్ నాయకురాలు కుసుమ, ఆమె తండ్రి హనుమంతరాయప్పలు కుట్ర పన్నారన్నారు. డీసీఎం డీకే శివకుమార్, ఆయన సోదరుడు డీకే సురేశ్‌లు నన్ను హత్య చేసేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిం చారని ఆరోపించారు. 150మంది వారి అనుచరులు ఒక్కసారిగా దాడికి దిగారన్నారు. బీజేపీ కార్యకర్తలు, నా అభిమానులు, పోలీసులు లేనిపక్షంలో హతమార్చేవారన్నారు. వారి దాడి వెనుక కుట్ర ఉందన్నారు



నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే

### రాష్ట్రానికి జరిగిన అవమానం: విజయేంద్ర

ఎమ్మెల్యే మునిరత్నపై దాడిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తీవ్రంగా ఖండించారు. ఇది మునిరత్నకు జరిగిన అవమానం కాదని, రాష్ట్రానికి జరిగిన అవమానమన్నారు. ఇటువంటి దాడుల వెనుక ప్రత్యర్థులు ఏమి ఆశిస్తున్నారనేది అర్థం అవుతుందన్నారు. సువర్ణసౌధలో ఎమ్మెల్సీ సీటీ రవిపై దాడి చేశారని, సొంత నియోజకవర్గంలో తిరుగుతున్న ఎమ్మెల్యేపై దాడిని ఏమని అర్థం చేసుకోవాలన్నారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి తీవ్రంగా మండిపడ్డారు. పోలీసులు ఇటువంటి కేసులలో నిర్లక్ష్యం చేయరాదన్నారు.

## విద్యార్థులకు ప్రోత్సాహకాల పంపిణీ

దొడ్డబళ్ళాపుర, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకుని బీజేపీ, అంజనాద్రి చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలలో 80శాతానికిపైగా మార్కులు సాధించిన వెయ్యిమందికిపైగా విద్యార్థులకు ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో దొడ్డబళ్ళాపుర తాలూకా వ్యాప్తంగా విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత అటల్ బిహారీ వాజ్‌పేయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు మాట్లాడుతూ నాలుగేళ్లుగా అంజనాద్రి ట్రస్టు ద్వారా విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తోందని అభినందించారు. ఈ సంవత్సరం మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతిన అందచేయడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంచుకుని ఉన్నత హోదాలలో రాణించాలని పిలుపునిచ్చారు. అలాగే జీవితంలో స్థిరపడ్డాక మీరు కూడా ఇతరులకు సాయం చేయాలని తద్వారా ఉత్తమ సమాజానికి కృషి చేయాలన్నారు. బీజేపీ నాయకుడు హనుమంతరాయప్ప, మహిళా ప్రముఖులు పుష్ప శివశంకర్, హోబళి నగర అధ్యక్షుడు ముద్దణ్ణ, నాగేశ్, నగరసభ అధ్యక్షురాలు సుమిత్రా ఆనంద్, పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు లక్ష్మీనారాయణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రోత్సాహకాలతో విద్యార్థులు

## రైతుల సంక్షేమంపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న భక్తరహళ్ళి బైరేగౌడ

శిడ్లఘట్ట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతుల పట్ల మొసలి కన్నీరు మాని రైతులు పండించే పంటలకు శాస్త్రీయమైన ధర కల్పించే డాక్టర్ స్వామినాథన్ కమిషన్ నివేదికను అమలు చేయడంలో ప్రభుత్వాలు ప్రామాణికంగా వ్యవహరించాలని హసిరుసేన రైతుసంఘం రాష్ట్ర కార్యాధ్యక్షుడు భక్తరహళ్ళి బైరేగౌడ అభిప్రాయపడ్డారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని స్త్రీశక్తి భవన్‌లో ఏర్పాటైన రైతు దినోత్సవంలో భాగంగా చర్చాగోష్టిలో పాల్గొని మాట్లాడారు. రైతు దేశానికి వెన్నెముక అంటూ నాయకులు తమ ప్రసంగాలలో పేర్కొంటారని అయితే అన్నదాత సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో దృష్టి సారించడం లేదని ఆక్రోశం వ్యక్తం చేశారు. అతివృష్టి, అనావృష్టి కారణాలతో రైతులు నష్టపోతున్నారని క్రమేపీ సాగు చేసేవారి సంఖ్య తగ్గుతోందన్నారు. ప్రత్యేకించి నేటి యువత వ్యవసాయంపట్ల ఆసక్తి చూపడం లేదన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఆహార కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. దీన్ని నివారించేందుకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు అన్నదాతలను అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. యువతను సాగుపట్ల ఆసక్తి చూపేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాగా వర్షాకాలం ప్రారంభమయ్యాక తగిన విత్తన గింజలు, ఎరువులు లభించక రైతులు ఇబ్బంది పడే పరిస్థితి ఉంటోందని ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు. వ్యవసాయశాఖ సహాయక డైరెక్టర్ పి రవి, ఉద్యానవనాలశాఖ మంజుళ, పట్టుగూళ్ల మార్కెట్ సహాయక డైరెక్టర్ తిమ్మరాజు తదితరులు ప్రభుత్వ పథకాలను వివరించారు. కృషిక సమాజం డైరెక్టర్ మళ్ళూరు శివణ్ణ, ముత్తూరు కెంపేగౌడ, నాగమంగల శ్రీనివాసగౌడ, వెంకటేశప్ప తదితరులు పాల్గొన్నారు.

## భార్య మాజీ ప్రియుడిపై కొడవలితో దాడి

బెంగళూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): భార్య మాజీ ప్రియుడిపై భర్త కొడవలితో బహిరంగంగా దాడి చేసిన సంఘటన బెళగావి జిల్లా మల్లమ్మన బెళవడి గ్రామంలో చోటు చేసుకుంది. ముక్తుమ్ అనే వ్యక్తిపై ముత్తు గణాచారి దాడికి పాల్పడ్డారు. 24 సార్లు కొడవలితో కొట్టినా ముక్తుమ్ ప్రాణాలతో బయటపడ్డాడు. తీవ్ర గాయాలతో బెళగావి మెడికల్ కళాశాలలో చికిత్సలు పొందుతున్నాడు. ముక్తుమ్ అరవళ్ళి గ్రామ నివాసి. గణాచారి భార్యతో సంబంధం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయమై భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. ఈ కారణంతో గణాచారి భార్య పుట్టింటికి వెళ్లారు. ఇటీవల ముక్తుమ్ పలు సందర్భాలలో గణాచారిపట్ల హేళన చేస్తూ మాట్లాడినట్టు తెలుస్తోంది. ఆగ్రహంతో ఉన్న గణాచారి మంగళవారం సంతలో కనిపించినవేళ ముక్తుమ్‌పై కొడవలితో దాడి చేశాడు. పలువురు చూస్తున్నా విడిపించలేదని తెలుస్తోంది. చివరకు స్థానికులు గణాచారిని పట్టుకుని గాయాలపాలైన ముక్తుమ్‌ను ఆసుపత్రికి తరలించారు. కిత్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## వైభవంగా ఖాద్రీశుడి కల్యాణోత్సవం



కదిరి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలతో ఆలంకరించారు. పలు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవం చేశారు. శ్రీవారికి కల్యాణ కానుకలు సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, పార్థసారథి ఆచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

### విద్యుత్ చార్జీల పెంపుపై రేపు నిరసన

ధర్మవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను పెంచడాన్ని నిరసిస్తూ శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రంశ్రీనివాసరెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక కేతిరెడ్డి క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చందమూరి నారాయణరెడ్డి, కౌన్సిలర్‌లు మేడాపురం వెంకటేశ్, కేతాలోకేశ్, రమాదేవి, గజ్జలశివ, ఓబుళమ్మ పాల్గొన్నారు.



సాకమ్మకు స్వీట్ తినిపిస్తున్న మంత్రి మహదేవప్ప

## సాకమ్మకు మంత్రి స్వాగతం

బెంగళూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన సాకమ్మ పాతికేళ్ల తర్వాత కుటుంబ సభ్యులను చేరుకుంది. హిమాచల్‌ప్రదేశ్ నుంచి సాకమ్మ బుధవారం బెంగళూరు చేరుకుంది. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప స్వయంగా వృద్ధురాలు సాకమ్మకు మిఠాయి తినిపించి, సత్కరించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ కార్యదర్శి రణదీప్ ఉన్నారు. ఆమె రాకతో కుటుంబ సభ్యుల్లో ఆనందం నెలకొంది.

### చారిత్రక పోరాటానికి దిగి రావాల్సిందే

రాయచూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోసం సాగుతున్న చారిత్రక పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగి రావాల్సిందేనని ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డాక్టర్ బసవరాజ్ కళస అన్నారు. రెండున్నర ఏళ్లుగా నిరవధిక సమ్మె కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వం రాయచూరుకు ఎయిమ్స్ మంజూరు చేయకుండా జాప్యం చేస్తుండడం ఆశ్చర్యకరమన్నారు. నగరంలోని మహాత్మ గాంధి స్టేడియంలో నిర్వహిస్తున్న ఎయిమ్స్ నిరవధిక సమ్మె దీక్ష శిబిరంలో బుధువారానికి 958వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ బసవరాజ్ కళస, ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికగా ఉన్న ఎయిమ్స్‌ను మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులేమో అర్థం కావడం లేదన్నారు. ఎన్నికల సందర్భంగా ఎయిమ్స్ మంజూరుకు సమ్మతించిన ప్రజాప్రతినిధులు ఆ దిశగా ఎందుకు ప్రయత్నం చేయడం లేదని నిలదీశారు.రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోసం నాయకులందరూ ముఖ్యంగా ఇక్కడి ప్రజా ప్రతినిధులు తమవంతు పాత్ర పోషించాలని ఈ సందర్భంగా పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు.

## ఉత్సాహంగా స్పోర్ట్స్‌థాన్

బెంగళూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): జక్కూరు లే అవుట్‌లోని బిజి నేషనల్ పబ్లిక్‌స్కూల్ వార్షిక క్రీడోత్సవం స్పోర్ట్స్‌థాన్ 2024 ఉత్సాహంగా జరిగింది. ముఖ్యఅతిథిగా అబ్కారీ ఉప కమిషనర్ కెప్టెన్ అజిత్‌కుమార్, అతిథిగా గిరీశ్ ఏవీ, డీఆర్ రామమూర్తి, అమృతహళ్ళి ఎస్సై జ్యోతి, జడ్పీ మాజీ అధ్యక్షుడు రవికుమార్ పాల్గొన్నారు. పాఠశాల కార్యదర్శి ఎంబి లింగరాజ్, ప్రిన్సిపాల్ శమంత లింగరాజు అతిథులను స్వాగతించారు. క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలు ప్రారంభించారు. విజయ్ హడి నేతృత్వంలో పోటీలు సాగాయి. విద్యార్థుల క్రీడా ప్రతిభ చూపరులను ఆకట్టుకుంది. విజేతలకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు.



బహుమతులు అందచేస్తున్న ఎస్ఐ తదితరులు

## కేంద్రమంత్రి అమిత్‌షా తీరుపై నిరసన

దొమ్మసంద్ర, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అనుచితంగా వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ కర్ణాటక జనాందోళన సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఆనేకల్ పట్టణంలోని ఏఎస్‌బీ కళాశాల మైదానం నుంచి తాలూకా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరసనలో సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం సంపంగి మాట్లాడుతూ కేంద్రమంత్రి అమిత్‌షా నైతిక బాధ్యత వహిస్తూ ప్రజలకు క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులకు అంబేడ్కర్ రాజ్యాంగంపై గౌరవం లేదని మండిపడ్డారు. భీమ సంఘాల మహా సమాఖ్య గౌరవాధ్యక్షుడు హెబ్బాళ వెంకటేశ్, కన్నల్లి కృష్ణప్ప, సంఘం తాలూకా అధ్యక్షుడు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆందోళనకారులు

### రక్తదానంపై అవగాహన

ధర్మవరం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రక్తదానంపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాల యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు, ఆత్మీయ ట్రస్టు చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు.